క్లుప్తంగా

టెన్త్ విద్యార్థులను పబ్లిక్ పరీక్షలకు సిద్ధం చేయాలి



ముక్త్యాల(జగ్గయ్యపేట): కొద్ది రోజుల్లో జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని నందిగామ డీవైఈవో గౌరీశంకర్ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతుండటంతో ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులను గ్రేడ్‌లుగా విభజించి పరీక్షలకు సిద్ధం చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన ట్యాబ్‌లను విద్యార్థులు వినియోగించుకోవాలని తెలిపారు. అనంతరం రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా సర్వే నిర్వహించాలి

అల్లూరు(వీరులపాడు): జగనన్న శాశ్వత భూహక్కు– భూరక్ష పథకం ద్వారా గ్రామాల్లో నిర్వహిస్తున్న భూముల రీసర్వేను సిబ్బంది నిష్పక్షపాతంగా నిర్వహించాలని తహసీల్దార్ ఆశయ నాయక్ అన్నారు. మండలంలోని అల్లూరు గ్రామంలో జరుగుతున్న సర్వేను సర్పంచ్ బందెల రాణితో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వే సిబ్బందికి రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోటేరు సూర్యనారాయణ రెడ్డి, ఉప సర్పంచ్ బెల్లంకొండ నాగేశ్వరరావు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్యాట్ ఒలంపియాడ్‌లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ



నందిగామ: జాతీయస్థాయిలో జరిగిన క్యాట్ ఒలంపియాడ్‌లో ప్రతిభ కనబరిచిన శ్రీచైతన్య విద్యార్థులను శనివారం పాఠశాలలో ప్రిన్సిపాల్ గుత్తా ప్రదీప్ అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇటీవల జాతీయ స్థాయిలో జరిగిన క్యాట్ ఒలంపియాడ్ పరీక్షలో పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు బంగారు పతకాలతో పాటు నగదు పురస్కారాన్ని కూడా అందుకున్నారన్నారు. మరో 20 మంది విద్యార్థులు రెండవ దశ ఫలితాలలో ఉత్తీర్ణత సాధించారని ఆయన తెలిపారు.

అమర గాయకుడు ఘంటసాలకు స్వరాభిషేకం



విజయవాడకల్చరల్: హైదరాబాద్‌కు చెందిన గోకులం సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఘంటశాల శత జయంతి ముగింపు వేడుకలు నిర్వహించారు. దుర్గాపురంలోని ఘంటసాల వేంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో శనివారం అమృతగానం– అమృత స్వరం పేరుతో నిర్వహించిన సినీ సంగీత విభావరి మధురంగా సాగింది. రెండు గంటల పాటు సాగిన కార్యక్రమంలో ఘంటసాల మాష్టరు స్వరపరచిన, ఆయన గానం చేసిన గీతాలను హైదరాబాద్‌కు చెందిన బాల కామేశ్వరరావు, శాంతిశ్రీ, సాయి మేఘన, శిరీష కాకినాడకు చెందిన పీవీ రమణ ఆలపించారు. కార్యక్రమాలను పోలవరపు కోటేశ్వరరావు సాహితీపీఠం వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు ప్రారంభించారు. కళాకారుల కృషిని అభినందించారు. గోకులం సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపకుడు వై.సుబ్రహ్మణ్యం హైదరాబాద్‌లో ప్రతీ నెల కార్యక్రమాలు నిర్వహిసున్నామన్నారు. గాయకులు బాలకామేశ్వరరావు, పీవీ రమణలను సత్కరించారు.

స్వచ్ఛంద సేవలు అభినందనీయం

లిడ్ క్యాప్ డైరెక్టర్ కోనేరు సత్యప్రియ

రెడ్డిగూడెం: మదర్ సర్వీసు సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం రెడ్డిగూడెంలో అంతర్జాతీయ ఎన్‌జీవో దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ లిడ్ క్యాప్ డైరెక్టర్ డాక్టర్ కొనేరు సత్యప్రియ పాల్గొని మథర్ థెరిస్సా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ ఎన్‌జీవో దినోత్సవాన్ని లాభాపేక్షలేని స్వచ్ఛంద సేవా సంస్థలను, సమాజానికి దోహదపడే వ్యక్తులను గౌరవించుకోవటానికి అంకితమైన రోజుగా అభివర్ణించారు. స్వచ్ఛంద సేవా సంస్థలు కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో అందించిన సేవలు ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీసు రమేష్, సర్పంచ్ మల్లాది రాణి, వైస్ ఎంపీపీ చాట్ల రాబర్టు, మథర్ థెరిస్సా ట్రస్టు చైర్మన్ కోయ సుధా, హ్యూమన్ రైట్స్ నేషనల్ ఫౌండర్ బి.దాసు, సేవా రత్న నేషనల్ అవార్డు గ్రహిత మల్లాది ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

నూరు శాతం ఉత్తీర్ణతపై గురి

- పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- నియోజకవర్గంలో పరీక్షలకు సిద్ధమవుతున్న 1636 మంది విద్యార్థులు
- ఏప్రిల్ 3 నుంచి పబ్లిక్ పరీక్షలు



పెనుగంచిప్రోలు కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో రివిజన్ టెస్ట్ రాస్తున్న విద్యార్థులు

పెనుగంచిప్రోలు: విద్యార్థి జీవితంలో పదో తరగతి ఎంతో కీలకం. పది పరీక్షల్లో సాధించిన మార్కులే ఏ విద్యార్థి ఉన్నత విద్యకైనా తొలి మెట్టు. దీనిని దృష్టిలో పెట్టుకుని పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యాశాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను ప్రణాళికాబద్ధంగా చదివిస్తున్నారు. ఏప్రిల్ 3 నుంచి 18 వ తేదీ వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. గతంలో 11 ప్రశ్నపత్రాలు ఉండేవి. వాటిని ఏడు పేపర్లకు కుదించారు. పరీక్ష కాల వ్యవధి 3 గంటల 15 నిముషాలు కాగా ఒక్కో పేపర్ 100 మార్కులకు ఉంటుంది. పరీక్షలకు సన్నాహంలో భాగంగా విద్యార్థులకు సాయంత్రం 4 నుంచి గం.5.30 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. అవసరమైతే సెలవు రోజుల్లో కూడా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. కరోనా ప్రభావం వలన గత ఏడాది పదో తరగతి పరీక్ష ఫలితాలు అంతంత మాత్రంగా వచ్చాయి. ఈ విద్యా సంవత్సరం సక్రమంగానే సాగింది. నియోజకవర్గంలో ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 1636 మంది విద్యార్థులు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాయనున్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా ముందుగా మాక్ టెస్టులు నిర్వహిస్తున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. అన్ని సబ్జెక్టుల సిలబస్ పూర్తి చేయటమే కాకుండా రివిజన్ టెస్టులు కూడా పూర్తి చేశారు. సిలబస్ పునఃశ్చరణ చేస్తున్నారు.

నియోజకవర్గంలో పదో తరగతి విద్యార్థుల వివరాలు

మండలం	జెడ్పీ ఉన్నత పాఠశాలలు	పదోతరగతి విద్యార్థులు
1. జగ్గయ్యపేట	14	806
2. పెనుగంచిప్రోలు	07	369
3. వత్సవాయి	09	461

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



పదో తరగతి సిలబస్ పూర్తి చేసి రివిజన్ టెస్టులు నిర్వహిస్తున్నాం. ప్రణాళికాబద్ధంగా విద్యార్థులను చదివిస్తున్నాం. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ తరగతులు ఏర్పాటు చేసి నూరు శాతం విజయాలకు కృషి చేస్తున్నాం.

–నాగరాజు, ఎంఈఓ, వత్సవాయి మండలం

రోజూ రివిజన్ టెస్టులు రాస్తున్నాం



ప్రత్యేక తరగతుల్లో రివిజన్ టెస్టులు నిర్వహిస్తున్నారు. మరుసటి రోజు రివిజన్ టెస్ట్‌లో ఉన్న తప్పులను మాచేత సరి చేయిస్తున్నారు. స్టడీ మెటీరియల్స్ కూడా బాగా ఉపయోగపడుతున్నాయి. మంచి మార్కుల కోసం పట్టుదలతో చదువుతున్నాను.

–రేగండ్ల ప్రవర్షిని, విద్యార్థిని

వైఎస్సార్ సీపీ లీగల్‌సెల్‌ను బలోపేతం చేయాలి

- వైఎస్సార్ సీపీలో చేరిన న్యాయవాది హరికిరణ్
- కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్సీ



న్యాయవాదికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

నందిగామ టౌన్: న్యాయవాదుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుంటున్న చర్యలకు ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరిన న్యాయవాదులు పార్టీ లీగల్‌సెల్‌ను బలోపేతం చేయాలని శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ సమావేశం నిర్వహించారు. ముందుగా పార్టీలో చేరిన న్యాయవాది పందిరి హరి కిరణ్‌కు అరుణకుమార్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలో జరగనున్న బార్ అసోసియేషన్ ఎన్నికల్లో పార్టీలకతీతంగా మంచి వ్యక్తులను ఎన్నుకోవాలని సూచించారు. పేదలకు పార్టీ లీగల్ సెల్ తరఫున ఉచిత న్యాయ సహాయాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఈశ్వరప్రగడ రంగారావు, మట్టా ప్రసాద్, బండి మల్లికార్జునరావు, పింగళి లక్ష్మీ నరసింహారావు, నంద్రు శ్రీరామ్మూర్తి, అద్దంకి మణిబాబు, షేక్ సైదా, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడికి సన్మానం



జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు పెంటి శ్రీనివాసరావును సన్మానిస్తున్న బీసీ సంఘాల నేతలు

జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా చేనేత విభాగం అధ్యక్షునిగా నియమితులైన పెంటి శ్రీనివాసరావును శనివారం బీసీ సంఘాల నేతలు ఘనంగా సన్మానించారు. స్థానిక దళిత బహుజన ఫ్రంట్ కార్యాలయంలో ఫ్రంట్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు అంగడాల పూర్ణచంద్రరావు అధ్యక్షతన జరిగిన అభినందన కార్యక్రమంలో పలువురు బీసీ సంఘాల నాయకులు పెంటి శ్రీనివాసరావును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ఎంపీపీ పెంటి శ్రీనివాసరావు బీసీ ఉద్యమాలలో చురుకుగా పాల్గొంటూ వారి సంక్షేమానికి కృషిచేశారని, వారి సేవలను గుర్తించి జిల్లా చేనేత విభాగం అధ్యక్షునిగా నియమించినందుకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభానుకు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు పోలంపల్లి రాధమ్మ, చల్లా వైకుంఠరావు, పచ్చిపాల నాగేశ్వరరావు, కుంభం వెంకట్, దేవరకొండ శ్రీనివాసరావు, ప్రగతి నారీశక్తి అధ్యక్షురాలు పొట్లూరి దేవి, సైకాలజిస్ట్ ఎం.శ్రీప్రియ పాల్గొన్నారు.

బలుసుపాడులో ఏసు శిలువమార్గం ర్యాలీ



బలుసుపాడు(జగ్గయ్యపేట అర్బన్): మానవుల పాపాల పరిహారార్థమై ప్రభువైన యేసు క్రీస్తు శిలువను ధరించాడని ఫాదర్ స్వామినాథం అన్నారు. మండలంలోని బలుసుపాడు గ్రామంలో ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం శిలువ మార్గం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ పెద్దలు, విశ్వాసులు గ్రామంలో యేసు పొందిన శ్రమలను వివరిస్తూ కీర్తనలు పాడుకుంటూ శిలువ మార్గం ర్యాలీ నిర్వహించారు. అనంతరం చర్చిలో ఉపదేశం అందజేశారు. కార్యక్రమంలో చర్చి ఉపదేశి చార్లెస్ మాస్టర్, సంఘ పెద్దలు గండమాల మరియన్న(వెంకటి), మైల మేరి వినీత, ఉప్పుతోళ్ల బాలస్వామి, జగ్గయ్యపేట విచారణ ఆర్‌సీఎం సిస్టర్లు జూలి, మేరి, దీవెన, సంఘస్తులు పాల్గొన్నారు.

4 నుంచి మహిళా ఉత్సవ్-2023

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): మార్చి 4 నుంచి 12 తేదీ వరకు మధుచౌక్‌లోని మొగల్ ఎగ్జిబిషన్ హాల్‌లో మహిళా ఉత్సవ్–2023 నిర్వహిస్తున్నట్లు జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఏ.పూర్ణిమ తెలిపారు. మహిళలు తయారు చేసిన ప్రింటింగ్, స్క్రీన్ ప్రింటింగ్, ఎంబ్రాయిడరీ చీరలు, ఫ్యాషన్ డిజైనింగ్, టైలరింగ్, జూట్ బ్యాగుల తయారీ, ఫుడ్ ప్రాసెసింగ్, బొమ్మల తయారీ మొదలైన ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాలు జరుగుతాయన్నారు. మహిళా ఉత్సవ్‌లో తమ ఉత్పత్తులను విక్రయించాలనుకునే వారు ఈ నెల 28వ తేదీ మంగళవారంలోపు మొగల్రాజపురం, రావిచెట్టు సెంటర్‌లో ఉన్న తమ సంస్థ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

'వర్ణాంచిత అంగుళీ విన్యాసం' గ్రంథావిష్కరణ

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): కేంద్రీయ విద్యాలయానికి చెందిన కవి, చిత్రకారుడు ఆత్మకూరు రామకృష్ణ రచించి ప్రచురించిన ఫింగర్ పెయింటింగ్ మారథాన్ 'వర్ణాంచిత అంగుళీ విన్యాసం' గ్రంథావిష్కరణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. పాఠశాలలో రామకృష్ణ చిత్రకళ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఫింగర్ పెయింటింగ్ చిత్రకారుడిగా 2010లో 100 చిత్రాలతో రికార్డు సృష్టించినట్లు ప్రిన్సిపాల్ పీవీఎస్ఎస్ఆర్ కృష్ణ తెలిపారు. అనంతరం రామకృష్ణను ఘనంగా సత్కరించారు.

దేశాభివృద్ధిలో సీఏల పాత్ర కీలకం



ఐసీఏఐ విజయవాడ అసోసియేషన్ ప్రమాణ స్వీకారోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

గుణదల(విజయవాడతూర్పు): దేశాభివృద్ధిలో చార్టెడ్ ఎకౌంటెంట్స్ కీలక పాత్ర పోషిస్తున్నారని సివిల్ సప్లెస్, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. చార్టెడ్ ఎకౌంటెంట్స్ విజయవాడ అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం గురునానక్ కాలనీలోని ఎన్ఏసీ కల్యాణ మండపంలో శనివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ.. చార్టెడ్ ఎకౌంటెంట్స్ తమ విభాగంలో మెరుగైన సేవలందించాలని కోరారు. దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్ట పరచటంలో చార్టెడ్ ఎకౌంటెంట్స్ నిబద్ధతగా పనిచేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా చిన్న తరహా పరిశ్రమలకు తోడ్పాటు అందించాలని సూచించారు. విజయవాడ బ్రాంచ్ వరుసగా మూడో సారి జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి సాధించడం అభినందనీయమన్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. విజయవాడ నూతన కమిటీ చైర్మన్‌గా వీర్ల సరేంద్ర బాబు, వైస్ చైర్మన్‌గా నిట్ట రవికిషోర్, కార్యదర్శిగా కంచమరెడ్డి నారాయణ, కోశాధికారిగా ఉప్పులూరి జయంత్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. కమిటీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో దక్షిణ భారత ప్రాంత చైర్మన్ పున్నారాజ్, సీఏలు ప్రసన్న కుమార్, శ్రీధర్, చిన్న మస్తాన్, సునీల్ కుమార్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

దినత్రయ చతుర్వేద మాస పారాయణం ప్రారంభం

మధురానగర్(విజయవాడసెంట్రల్): టీటీడీ వేదపారాయణ పథకం ఆధ్వర్యాన ప్రజలు సుభిక్షంగా ఉండాలని అయోధ్యనగర్ శ్రీదత్త సాయి శివకామేశ్వరీపీఠంలో దినత్రయ చతుర్వేద మాస పారాయణం శనివారం ప్రారంభమైంది. ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుతూ వేద పండితులు శ్రీరుద్రమును పారాయణం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమాలను పథకం జిల్లా సూపర్‌వైజర్ గుళ్లపల్లి శివశర్మ శ్రౌతి పర్యవేక్షించారు.



పారాయణం చేస్తున్న వేదపండితులు

మైలవరంలో నగదు, బంగారం చోరీ



ఇంట్లో బీరువాను పరిశీలిస్తున్న పోలీసులు

మైలవరం: తాళాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి నగదు, బంగారం దోచుకుపోయిన సంఘటన మైలవరంలో జరిగింది. మైలవరం ఎస్వీఎస్ నగర్‌లో నివాసం ఉంటున్న బూరుగుల కిశోర్ శర్మ శుక్రవారం ఇంటికి తాళాలు వేసి మండలంలోని దాసుళ్లపాలెంలో తన తండ్రి ఇంటిలో జరుగుతున్న పూజా కార్యక్రమాలకు హాజరయ్యాడు. దొంగతనం జరిగిన విషయాన్ని చుట్టుపక్కల వారు బాధితుడికి తెలియజేయడంతో ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చాడు. అదే రోజు రాత్రి ఇంటికి వేసిన తాళాలు పగులగొట్టి దొంగలు ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో దాచిన సుమారు రూ.2 లక్షలు నగదు, ఐదు కాసులు బంగారు వస్తువులు దోచుకుపోయారని బాధితుడు బూరుగుల కిశోర్ శర్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఇంటిని, పరిసరాలను పరిశీలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాంబాబు తెలిపారు.

నేటి నుంచి యథావిధిగా తాగునీటి సరఫరా

మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర



హెడ్ వాటర్ వర్క్స్‌లో మోటార్ల ఫిటింగ్ పనులను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర

జగ్గయ్యపేట అర్బన్: పట్టణానికి నీటి సరఫరా చేసే హెడ్ వాటర్ వర్క్స్‌లో మోటార్ల మరమ్మతులు పూర్తయ్యాయని, ఆదివారం నుంచి పట్టణంలోని అన్ని వార్డుల్లో యథావిధిగా తాగునీటిని సరఫరా చేయనున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా శనివారం హెడ్ వాటర్ వర్క్స్‌లో మోటార్ల ఫిటింగ్ పనులను ఆయన పర్యవేక్షించారు. అనంతరం మాట్లాడుతూ మోటార్ల మరమ్మతుల కారణంగా గత కొన్ని రోజులుగా ప్రజలకు తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందన్నారు. ఈ మోటార్లు 30 ఏళ్ల నాటివి అయినందున మరమ్మతులకు గురయ్యాయని, మోటార్లను విజయవాడలో మరమ్మతు చేయించామన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శివకోటేశ్వరరావు, హెడ్ వాటర్ వర్క్స్'లో ఇంజినీరింగ్ సిబ్బందికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. రానున్న వేసవి కాలం దృష్టిలో పెట్టుకొని యుద్ధప్రాతిపదికన మోటార్లను రిపేరు చేయించామన్నారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్ కొలగాని రాము, మున్సిపల్ కమిషనర్ శివకోటేశ్వరరావు, ఏఈ హనుమంతరావు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తుల సౌకర్యాలకు అధిక ప్రాధాన్యం



సమావేశంలో ఆలయ ఈఓ లీలాకుమార్, చైర్మన్ చెన్నకేశవరావు, పాలకవర్గ సభ్యులు

పెనుగంచిప్రోలు: ఆలయం వద్ద భక్తుల సౌకర్యాలకు అధిక ప్రాధాన్యం ఇస్తామని ఈఓ జీవీడీఎన్ లీలాకుమార్, చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు అన్నారు. గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మ వారి ఆలయ పాలకవర్గ సమావేశం శనివారం చైర్మన్ చాంబర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అంశాలపై తీర్మానాలు చేయటంతో పాటు చర్చించారు. ముందుగా మార్చి 7 నుంచి 11 వరకు జరిగే చిన్న తిరునాళ్ల ఉత్సవాలకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం 2023–24 కు సంబంధించి ఆలయం వద్ద వివిధ వ్యాపారాలు నిర్వహించటానికి ఆమోదం తెలపటంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో ఆలయ ఈఈ వైకుంఠరావు, ఏఈఓలు జి.ఉమాపతి, తిరుమలేశ్వరరావు, ఏఈ రాజు, పాలకవర్గ సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన గురుకుల పాఠశాల ఆకస్మిక తనిఖీ



విద్యార్థినిలతో మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాసరావు

నందిగామ: ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని పట్టణంలోని జిల్లా 16వ అదనపు కోర్టు న్యాయమూర్తి వి.శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాల వసతి గృహాన్ని శనివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న వసతులు, ఆహార పదార్థాలలో నాణ్యత, విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతున్నారా లేదా అనే అంశాలపై ఆరా తీశారు. పలు అంశాలపై విద్యార్థులను అడిగి సమాచారం సేకరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

అమ్రితసాయిలో కల్చరల్ ఫెస్ట్



పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాలలో నృత్యాలు చేస్తున్న విద్యార్థినిలు

కంచికచర్ల: పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఫేర్‌వెల్, ఫ్రెషర్స్‌డే వేడుకలు జరిగాయని కళాశాల కరస్పాండెంట్, కార్యదర్శి కె.రామ్మోహన్‌రావు తెలిపారు. బీటెక్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఫ్రెషర్స్‌డే, థర్డ్, ఫైనల్ బీటెక్ చదువుతున్న విద్యార్థులు ఫేర్‌వెల్ కార్యక్రమాలు నిర్వహించారన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శశిధర్ మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టూడెంట్ క్లబ్ ద్వారా ఇటువంటి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. దీంతో విద్యార్థుల్లో లీడర్‌షిప్, మేనేజింగ్ స్కిల్స్‌తో పాటు ఆత్మవిశ్వాసం వంటి అంశాలను పెంపొందించుకోవచ్చని అన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా విశిష్ట ప్రతిభ చూపిన అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలతో పాటు నగదు బహుమతులు అందజేశారు.

పకడ్బందీగా భూ హక్కు, భూ రక్ష పథకం

తహసీల్దార్ రాజకుమారి



పరిటాలలో సరిహద్దు రాళ్లను దగ్గరుండి పాతిస్తున్న తహసీల్దార్ రాజకుమారి

కంచికచర్ల: ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని పరిటాల గ్రామంలో జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా 6,208 ఎకరాలను రీ సర్వే చేసి రైతులకు పట్టాలు పంపిణీ చేశామని తహసీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి తెలిపారు. ప్రభుత్వం పంపిణీ చేసిన సరిహద్దు రాళ్లను శనివారం పాతారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, గత ఆరురోజుల నుంచి రైతుల పొలాల్లో సరిహద్దు రాళ్లను పాతుతున్నామని తెలిపారు. రైతులు పొలానికి భూ హక్కు పత్రంతో హాజరుకావాలని కోరారు. వచ్చే నెల 15వ తేదీలోగా సరిహద్దు రాళ్లను పాతే కార్యక్రమం పూర్తిచేసేలా తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇందుకు రైతులు, కౌలురైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ ఆఫ్ సర్వేయర్ నంద్రు అనూష్‌కుమార్, డీటీ నాగుల్‌మీరా, ఆర్ఐ శిరీష, వీఆర్వోలు వేముల ప్రదక్షిణరావు, శ్రీలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

ప్రతిభకు ప్రోత్సాహం అందించాలి



గాయకుడు రసూల్‌బాబును సత్కరిస్తున్న రమాసత్యనారాయణ, విజయలక్ష్మి తదితరులు

విజయవాడకల్చరల్: కళాకారులు, నటులు, గాయనీ గాయకులలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సాహం అందించాలని శాతవాహన కళాశాల కరస్పాండెట్ నిడుమోలు రమాసత్యనారాయణ అన్నారు. డ్రీమ్ ఆడియో ఆధ్వర్యంలో త్రిభాషా గాయకుడు రసూల్‌బాబు గాయకునిగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆత్మీయ సత్కారం, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని శనివారం గాంధీనగర్ కొత్తా పూర్ణానందం కళావేదికపై నిర్వహించారు. డ్రీమ్ ఆడియో వ్యవస్థాపకుడు చావా నరసింహారావు సంస్థ పక్షాన గాయకుడు రసూల్‌బాబును సత్కరించారు. రసూల్‌బాబు మాట్లాడుతూ కళా సంస్థల ప్రోత్సాహంతోనే 25 ఏళ్లు పూర్తి చేస్తుకున్నామన్నారు. సత్కార కార్యక్రమంలో సాహితీ సంస్థల ప్రతినిధులు పరచూరి విజయలక్ష్మి, చింతకాయల చిట్టిబాబు, కొప్పరపు బలరామకృష్ణ మూర్తి పాల్గొన్నారు. నగరానికి చెందిన పలువురు గాయనీ గాయకులు తెలుగు, హిందీ చిత్రగీతాలను ఆలపించారు.